క్లుప్తంగా

కిక్‌బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు మహబూబ్‌నగర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో పాయింట్ ఫైట్‌లోని ఆయా విభాగాల్లో ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. గుల్‌ఫిషా -46 కేజీల విభాగంలో బంగారు పతకం, హఫ్సా బేగం-42 కేజీల విభాగంలో బంగారు పతకం, అజహర్ -60కేజీల విభాగంలో బంగారు పతకం, ఆయేషాబేగం -42 కేజీల విభాగంలో రజత పతకం, ఉమ్మే ఖిబ్రబేగం-50 కేజీల విభాగంలో రజత పతకం, మహ్మద్ ఫహద్ -48కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులు జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కిక్‌బాక్సింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. క్రీడాకారులను రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్రముల్లా హుస్సేని, ఉపాధ్యక్షులు ఎండి.నవీద్ బియాబాని, కోశాధికారి నాగేశ్వర్‌రావులు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో అన్నదానం కార్యక్రమాలు



నవాబుపేట: అయ్యప్ప మండల సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య రావడంతో మండల కేంద్రంలోని శివాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రం మొత్తం ప్రత్యేక పూజలు, అన్నదానాలతో నిండిపోయింది. కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత మహిళా సంఘం మహిళలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో అయ్యప్ప సేవా సమితి బ్రహ్మం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రేమ్ సుధాకర్‌జీ, యాదయ్య, శివ, సురేశ్, నర్సింహులు, కోట్లరాజు, అశోక్, శ్రీనివాస్, నర్సింహులు, సుదీంద్ర, సంతోష్, భాస్కర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


నేడు బంగారు మైసమ్మ శిఖర ప్రతిష్ఠ

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ పంచాయతీ సత్రోనిపల్లితండాలో వెలిసిన బంగారు మైసమ్మ ఆలయంలో సోమవారం మహాసంప్రోక్షణ కార్యక్రమం ఉంటుందని కార్యక్రమ నిర్వాహకులు చందర్‌నాయక్, తులసీరాంనాయక్, రాఘవేందర్‌గుప్తా, రఘుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఆలయంలో శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటున్నట్లు వివరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

పోచమ్మ ఆలయానికి విరాళం

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్దిలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి భూత్పూర్ మండలానికి చెందిన హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సరోజ్‌రెడ్డి ఆదివారం రూ.30వేల నగదును విరాళంగా అందజేశారు. పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు సరోజ్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోట్ల రవి, చంద్రయ్యగౌడ్, పరిపూర్ణాచారి, గట్టు రాఘవేందర్‌గౌడ్, దాసరి వెంకటేశ్, మహేందర్, నజీర్, నాగరాజు, శేఖర్ ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గా యాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వే ములకు చెందిన గొల్ల కృష్ణయ్య, దాసర్‌పల్లికి చెంది న యాదయ్యగౌడ్ బైక్‌పై మహబూబ్‌నగర్ నుంచి ఇంటికి వస్తున్నారు. జాతీయ రహదారి 44పై జానంపేట శివారులోని పెట్రోల్ బంకు దాటిన తర్వాత మూసాపేట సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్ రోడ్డు కిందికి దూసుకెళ్లగా దానిపై ఉన్న ఇద్దరు కిందపడ్డారు. ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం తప్పించుకుని వెళ్లిపోయింది. దీనిపై బాధితుల బంధువుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

నిఘానేత్రం.. నామమాత్రం



గండేడ్‌లో ఏర్పాటు చేసినా పత్తాలేని సీసీ కెమెరాలు



గాధిర్యాల్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

- పనిచేయని సీసీ కెమెరాలు, కొరవడిన భద్రత
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న స్థానిక ప్రజానీకం
- అక్రమాలు, చోరీలకు అడ్డువేయని అధికారులు
- నిర్లక్ష్యం వీడని పోలీసు వ్యవస్థ

మహమ్మదాబాద్: శాంతిభద్రతల పరిరక్షణలో సీసీటీవీ కెమెరాల పాత్ర చాలా కీలకం. ఒక్క సీసీటీవి వందమంది పోలీసులతో సమానం. అంతటి నిఘా కళ్లకు నిర్లక్షపు నీడలు కమ్ముకున్నాయి. సరైన పర్యవేక్షణ లేక, నిర్వహణ లోపంతో కెమెరాలు పని చేయడం లేదు. ఆయా గ్రామాల్లో దొంగతనాలు జరుగకుండా పోలీసులు జోక్యం చేసుకుని ప్రజాప్రతినిధుల సహాయంతో రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నేడు పనిచేయకుండా పోవడంతో ఎన్నో అక్రమాలు, దొంగతనాలకు ఊతమిస్తున్నాయి. ఉమ్మడి మండలంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎన్నో రోజులుగా పనిచేయకున్నా పోలీసులు పట్టించుకున్న పాపానపోవడంలేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

❖ ఉమ్మడి గండేడ్ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో రోడ్లపై ప్రధాన రహదారులు, చౌరస్తాలు, ఆయా దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మొత్తం 70వరకు ఉండేవి. వాటిలో గతంలో కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహాయంతో ప్రధాన చౌరస్తాల్లో 40వరకు ఏర్పాటు చేశారు. మిగతావి దుకాణాలు, ప్రధాన రహదారుల చౌరస్తాల్లో 30వరకు ఏర్పాటు చేశారు. ఇలాంటి కెమెరాలతో గతంలో ఎన్నో నేరాలు, ఆలయ, వాహన, పశువుల దొంగతనాలను గుర్తించారు. ప్రస్తుతం మాత్రం ప్రధానంగా మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉమ్మడి మండలంలో జానంపల్లి, సల్కర్‌పేట్, గండేడ్, నంచర్ల క్రాస్‌రోడ్డు, మొకర్లాబాద్, చౌదర్‌పల్లి, గాధిర్యాల్, కూడళ్లు, వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి గేట్ తదితర గ్రామాల్లో కొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో మరిన్ని నేరాలు, చోరీలు పెచ్చుమీరుతున్నాయి.

ఆగని నేరాలు, చోరీలు

రెండేళ్ల కిందట చౌదర్‌పల్లి భీమరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో 10కిలోల వెండి కవచం, నంచర్ల గేట్‌లో రాఘవేందర్ అనే యువకుడు ఆటో గ్యారేజ్ వద్ద నిలిపిన ఆటోను చోరీ చేశారు. గండేడ్ మండల కేంద్రంలో ఓ బ్యాంకు ఏటీఎం వద్ద చోరీ విఫలమైంది. జూలై 31న కొంరెడ్డిపల్లిలో రూ.3 లక్షల వరకు విలువచేసే 38 గొర్రెలు, ఆగస్టు 7న వెన్నాచేడ్‌లో లక్షకుపైగా విలువచేసే 40గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఇలా కేవలం చోరీలే కాకుండా ఇసుక, రేషన్ బియ్యం రవాణా ఇలా ఎన్నో అక్రమాలు జరిగిపోతున్నాయి.

> **పనిచేయని వాటి వివరాలు సేకరిస్తాం**
>
> మండల వ్యాప్తంగా కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పనిచేయని మాట వాస్తవం. అలాంటి వాటి వివరాలు సేకరిస్తే రోడ్డు విస్తరణలో వాటిని తీసుకెళ్లారు. ఉన్నచోట టెక్నీషియన్లను పంపించి చూయిస్తాం. వాటికయ్యే ఖర్చు కొన్ని భరిస్తున్నాం. ఆయా గ్రామాలవారే ఖర్చులు భరించి రిపేర్లు చేయించుకోవాలి. చోరీలకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం.
>
> – శేఖర్‌రెడ్డి, ఎస్ఐ, మహమ్మదాబాద్

కొన్నాళ్లకే పని చేయడం లేదు



గాధిర్యాల్‌లో రూ.60వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్నిరోజులకే పనిచేయడంలేదు. దీంతో పలుమార్లు సంబంధిత అధికారులకు యువకులు తెలిపినా ఫలితం లేకపోయింది. ఇక్కడ ప్రధాన ఆలయంతోపాటు మండలంలోని చివరి గ్రామం. ఇలాంటి స్థలాల్లో సీసీ కెమెరాలు పనిచేయకుంటే ఏమి జరిగినా ఎవరు బాధ్యత వహించాలి.

– గుండాల కృష్ణయ్య, గాధిర్యాల్

సీసీ కెమెరాలు ఉంటే దొరికేవి..



మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలు, మండల చివరి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎలాంటి దొంగతనాలైనా పట్టుకోవచ్చు. ఇది పోలీసులకు సులువుగా బయటపడుతుంది. కొంరెడ్డిపల్లి, వెన్నాచేడ్‌లో ఇంటి పక్కనే మంద నిలిపినచోట 40గొర్రెలను వాహనంలో ఎత్తుకెళ్లారు. ఎంతవెతికినా జాడ లేదు. జానంపల్లి వద్ద సీసీ కెమెరాలు ఉంటే దొంగతనం బయటపడేదీ.

– రఘు, వెన్నాచేడ్

మురుగు వెళ్లక.. తిప్పలు తప్పక



కప్పెట పాఠశాల ఎదుట గుంతలమయంగా మారిన దారి

భూత్పూర్: మండలంలోని కప్పెటలో ఇటీవల కురుసిన వర్షానికి దారి గుంతలుగా ఏర్పడి నీరు నిలచింది. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఎదుట నీరు నిలవడంతో విద్యార్థులు ప్రతినిత్యం పాఠశాలకు రావడానికి ఇబ్బందిగా మారింది. గ్రామస్తులకు వృద్ధులకు రాత్రి వేళల్లో నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రతి నిత్యం ఇదే దారిగుండా వస్తున్నా.. గుంతలల్లో నీరు, బురద కన్పించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని గుంతల్లో మట్టి వేసి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండా లక్ష్మణ్‌కు నివాళి



జడ్చర్ల టౌన్: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జడ్చర్ల ఎమ్మార్సీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. తొలి, మలి విడతల తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిపిన గొప్ప సంఘసంస్కర్తగా కొని యాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 1989 లో మంత్రి పదవిని సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఫకీర్ జహంగీర్, సురభి విజయ్‌కుమార్, రాధాకృష్ణ, రాఘవేందర్, గోబ్రానాయక్, జాని, జములయ్య పాల్గొన్నారు.

'ర్యాపిడో, ఉబర్ యాప్‌లను రద్దు చేయాలి'



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆటో వాలాల పొట్టకొడుతున్న ర్యాపిడో, ఉబర్ యాప్‌లను రద్దు చేయాలని ఆటో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన జేఏసీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రాములు, రామ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత ర్యాపిడో, ఉబర్, ఓలా యాప్‌లను తీసుకొచ్చి నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాడం ఆడుతున్నారని ఆరోపించారు. ఇందుకు ఎంపీ అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, టీయూసీఐ రాష్ట్ర నాయకులు వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్రాన్స్‌ఫోర్ట్ రంగంపై కనీసమైన కనికరం కూడా లేదన్నారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న సంవత్సరానికి రూ.12వేలు నేటికీ ఇవ్వడం లేదని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలోని కార్మికులను ప్రత్యేక సంక్షేమ బోర్డు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ ఆటో యూనియన్ జిల్లా నాయకులు రాజు, నగేశ్, బాబుమీయా పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మరికల్ : రైతుల సౌకర్యార్థం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర కార్యదర్శి బి.రాము డిమాండ్ చేశారు. ఆదివారం కోటకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పత్తి పంట చేతికి వచ్చినా కొనుగోలు ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదన్నారు. వర్షాల వల్ల పత్తి తడి సి రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తీసిన పత్తిని నిలువ చేసుకొనే సౌకర్యం రైతులకు ఉండదని, ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి)పొడువు పింజ రూ.8110, మధ్య స్థ పింజ రూ.7710గా ప్రకటించినా ఈ ధరలు ఎక్కడ అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు



దోకూర్ సమీపంలో బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



జడ్చర్లలోని ఎంప్లాయిస్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జడ్చర్ల టౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జడ్చర్లలో బతుకమ్మ సంబరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, సాయినగర్ సకలదేవతల ఆలయం, బంగారు మైసమ్మ ఆలయం, హౌజింగ్ బోర్డు కాలనీ సీతారామంజనేయస్వామి ఆలయం, శ్రీనివాసనగర్ మైసమ్మ ఆలయం, సరస్వతీనగర్‌లో మహిళలు ఎంగిలిపూల బతుకమ్మను తీర్చిద్ది ఉత్సవాలు ప్రారంభించారు. లక్ష్మీవెంకటేశ్వర ఎంప్లాయిస్ కాలనీలోనూ మహిళలు పెద్దఎత్తున బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

దేవరకద్ర: దేవరకద్రలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఆటపాటలతో అలరించాయి. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకొచ్చి సంబరాలు జరుపుకొన్నారు. పట్టణంలోని కోయిల్‌సాగర్ రోడ్‌లో ఆదివారం రాత్రి మహిళలు బతుకమ్మ పాటలతో బొడ్డెమ్మలు వేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా కాలనీవాసులంతా సంబరాల్లో పాల్గొన్నారు. తపోవన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. వివిధ రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఊరేగింపుంచారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.



తపోవన్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బతుకమ్మలు

తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు



పండుగ సాయన్న విగ్రహం సమీపంలో వృథాగా మెయిన్‌రోడ్డుపై పారుతున్న తాగునీరు



లీకేజీ ఏర్పడింది ఇక్కడే..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్ట్ వద్ద (ఎన్‌హెచ్-167 పక్కన) పండుగ సాయన్న విగ్రహం సమీపంలో కొన్ని నెలల క్రితం మిషన్ భగీరథ పథకం పైపులైన్ లీకేజీ అయింది. మెయిన్ రోడ్డు వెంట ప్రతినిత్యం తాగునీరు వృథాగా ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ వసంతను వివరణ కోరగా అక్కడి పైపులైన్ నుంచి ఓ ఇంటి వరకు ఇచ్చిన నల్లా కనెక్షన్ మధ్య ఇలా లీకేజీ ఏర్పడిందన్నారు. దీనిని సంబంధిత యజమానే బాగు చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన వాసవీమాత ఆలయం



జడ్చర్లలోని వాసవీమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల తోరణాలు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లను చేశారు. పట్టణంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. సోమవారం ఉద యం పూజల అనంతరం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మొదటి రోజు దుర్గామాతను బాలత్రిపురాసుందరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. 11 రోజులపాటు దుర్గామాతను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వాసవీమాత ఆలయంలో..

దేవరకద్రలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించకుని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలు

జడ్చర్ల టౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అట్టహాసంగా ప్రారంభంకానున్నాయి. ఇందుకు ఉత్సవ కమిటీలు మండపాలను తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు. మొదటిరోజున కొన్ని మండపాల్లో బాలత్రిపుర సుందరిదేవీగా, మరికొన్ని మండపాల్లో శైలపుత్రిగా అమ్మవారిని అలంకరించనున్నారు. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద భారీగా విద్యుద్దీపాలతో అలంకరించి స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

శ్రీగిరిక్షేత్రంలో చండీహోమం

మండలంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9రోజుల పాటు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కృష్ణస్వామి తెలిపారు. హోమంతోపాటు అమ్మవారికి నిత్యం అలంకరణలు చేయనున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి



కాలనీ వాసులకు సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



పోలీసులు గుర్తించిన సరైన పత్రాలులేని వాహనాలు

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- ప్రేమ్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్టు
- సరైన పత్రాలు లేని 35 వాహనాల స్వాధీనం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో ఆదివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్టు నిర్వహించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో సాగిన ఈ సెర్చ్‌లో పోలీసులు మొత్తం 300ఇళ్లను తనిఖీ చేసి వాటిలో నివాసముండే వారి వివరాలు పరిశీలించారు. అదేవిధంగా 192 బైకులు, 16 ఆటోలు, 17కార్లకు సంబంధించిన డాక్యుమెంట్స్ తనిఖీలు చేయగా దీంట్లో సరైన పత్రాలు లేని 32 బైకులు, మూడు ఆటోలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతికాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను నియంత్రించడం సులభం అవుతుందన్నారు. దసరా పండగ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లేవారు కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో విలువైన వస్తువులు పెట్టరాదని, ఇంటి బయట గేట్లకు తాళాలు వేయడం, ప్రధాన తలుపులకు తాళాలు వేసి పెట్టి కన్పించే విధంగా పెట్టడంతో దొంగలకు చోరీలు చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. పండగ వేళ ప్రయాణాలు చేసే క్రమంలో కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ఇజాజుద్దీన్, అప్పయ్య, శ్రీనివాసులు ఇతర ఎస్ఐలు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

అడ్డాకుల: మూసాపేట మండలం వేములలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. హైవే నుంచి రాయచూర్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఎస్సీకాలనీ నుంచి చెరువు కట్ట వరకు కంకర పరిచి వదిలేశారు. కంకర రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీళ్లు నిలవడంతో రాకపోకలకు నరకం చూస్తున్నారు. వర్షం నీళ్ల మూలంగా దోమలు వ్యాప్తి చెంది స్థానికులు వ్యాధులకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా రోడ్డుపై వేసిన కంకర మూలంగా వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము పెద్ద ఎత్తున వెలువడుతోంది. దుమ్ము మూలంగా రోడ్డు పరిసరాల్లో ఉండే నివాస గృహాల్లో నివసించే వారు ఏడెనిమిదేళ్లుగా అవస్థలను ఎదుర్కొంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



వేములలో కంకర రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఆగని ఇసుక అక్రమ రవాణా

రాజాపూర్: మండల కేంద్రంతోపాటు పరిధిలోని ముదిరెడ్డిపల్లి, నందిగామ, తిర్మలాపూర్, ఈద్గాన్‌పల్లి తదితర గ్రామాల శివారురు దుందుభీ వాగులో రాత్రింభవళ్లు ఇసుక అక్రమంగా పట్టణాలకు తరలుతోంది. ఇసుక నిషేధం ఉన్నప్పటికీ ఇసుక మాఫియా యథేశ్చగా తమ వ్యాపారాన్ని మూడు ట్రాక్టర్లు, ఆరు టిప్పర్లుగా సాగుతోంది. అడపాదడపా రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు చేసినా ఇసుక మాఫియా అవేవి పట్టించుకోకుండా తమ వ్యహరానాన్ని గుట్టుగా నడుపుకొంటున్నారు. మండల కేంద్రంలో కొందరు నాయకుల అండదండలతో ఈ వ్యవహారం నడుస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి పక్కనే కూతవేటు దూరంలో ప్రతిరోజు హిటాచీలు, జేసీబీలు, ట్రాక్టర్లుతో కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న ఇసుక మాఫియాపై స్థానిక అధికారులు చూసిచూడనట్టుగా వ్యవహరిస్తుండడంతోనే ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారని అనడంలో ఎలాంటి సందేహం లేదు.



రాజాపూర్ శివారులో హిటాచీతో మట్టిని తీసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న దృశ్యం